
## ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

● రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కలెక్టరేట్ అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

నీలగిరి, ఏప్రిల్ 28 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మండలంలోని బక్కతాయికుంట వద్ద రూ.20 కోట్లతో చేపట్టనున్న బక్కతాయి కుంట ఎత్తిపోతల, రూ.6.8 కోట్లతో చేపట్టనున్న పానుగోడు ఎత్తిపోతల, రూ. 19.95 కోట్లతో చేపట్టనున్న నర్సింగ్‌భట్ల ఎత్తిపోతల పథకాలతో పాటు రూ.36 కోట్లతో కలెక్టరేట్ అదనపు భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల ద్వారా నీరందించేందుకు రూ.1800 కోట్లు మంజూరు చేసి పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. దాంతో పాటు హైలెవల్ కెనాల్‌కు రూ. 442 కోట్లు, పిల్లాయిపల్లి కాల్వ, శివన్నగూడెం నుంచి నారాయణపురం, చౌటుప్పల్ మీదుగా సాగునీరు అందించేందుకు లిఫ్టులు మంజూరు చేస్తానని ప్రకటించారు. దున్నపోతులగండి, ఐటిపాముల, నెల్లికల్‌లతోపాటు మరో నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతమున్న కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ ద్వారా రూ. 36 కోట్లతో అదనపు భవనాన్ని 9 నెలల్లో పూర్తి చేసి డీఎంహెచ్‌ఓ, డీఈఓ కార్యాలయాలను సైతం ఇక్కడకు తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, నేనావత్ బాలూ నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, కేతావత్ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరతచంద్రపవార్, అదనపు కలెక్టర్లు అమిత్‌నారాయణ్, రాజ్‌కుమార్, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఒక్కపోస.. రైతుల గోస

● ఒక్కపోస రకం వడ్ల దిగుమతికి మిల్లర్ల నిరాకరణ
● ఐకేపీ కేంద్రాల్లో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు
● ఇబ్బందులు పడుతున్న రైతులు



వెల్మినేడు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

చిట్యాల, ఏప్రిల్ 28 : ఒక్కపోస వరి రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు నిరాకరిస్తుండడంతో ఆ రకం సాగు చేసిన రైతులు గోస పడుతున్నారు. ఈ వివాదం నేపథ్యంలో రెండు రోజులుగా మండలంలోని వెల్మినేడు ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కొనుగొన్న కొత్తరకం వంగడం ఒక్కపోసతో దిగుబడి బాగా వస్తుండడంతో మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు వీటిని సాగు చేశారు. అయితే ఈ ధాన్యం మిల్లింగ్ చేస్తే తమకు నష్టం వస్తుందని మిల్లర్లు పేర్కొంటున్నారు.

**తరుగు పేరుతో అధిక తూకం**

ఒక్క పోస వడ్లను మిల్లింగ్ చేస్తే బియ్యం తక్కువగా వస్తున్నాయని, తమకు నష్టం వస్తుందని పేర్కొంటూ మిల్లర్లు ఐకేపీ కేంద్రం నుంచి వెళ్లిన లారీల్లోని ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదు. దాంతో ఆ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ఈ రకం ధాన్యానికి తరుగు కింద బస్తాకు రెండు నుంచి మూడు కిలోల ధాన్యాన్ని అధికంగా తూస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోళ్లలో ఎలాంటి తరుగు తీయవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ కొన్ని కేంద్రాల్లో తరుగు తీస్తున్నారని రైతులు చెబుతున్నారు. తరుగుకు నిరాకరించిన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిలిపివేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

**నిలిచిన కొనుగోళ్లు**

మండలంలో చిట్యాల పీఏసీఎస్ పరిధిలో 5, వెల్మినేడు పీఏసీఎస్ పరిధిలో 5, గుండ్రాంపల్లి పీఏసీఎస్ పరిధిలో 3 మొత్తం 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నా వడ్ల కొనుగోళ్లు మందకొడిగానే సాగాయి. రెండు రోజులుగా ఆయా కేంద్రాల్లో ఒక్కపోసతో పాటు మిగతా ధాన్యం కొనుగోలు కూడా పూర్తిగా నిలిపి వేశారు. గ్రామాల్లో సగటున రోజుకు నాలుగు నుంచి ఐదు లారీల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నా రెండు నుంచి మూడు లారీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు ఓ కేంద్రం నిర్వాహకుడు తెలిపాడు. తాము ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మిల్లులకు పంపించిన తర్వాత మిల్లర్లు దిగుమతికి ఆలస్యం చేస్తుండటమే ఇందుకు కారణమని నిర్వాహకులు చెబుతున్నారు. దాంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకు పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. వాతావరణంలో మార్పులు వస్తుండడం, అకాల వర్షాల భయం వెంటాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టాలను కిరాయికి తీసుకొచ్చి మరీ ధాన్యంపై కప్పుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

**అధిక దిగుబడి వస్తుండడంతో..**

మార్కెట్‌లో లభించే హైబ్రిడ్ రకాల్లో ఒక్కపోస రకం వరి ఒకటి. ఈ రకం సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుండడంతో చాలా మంది రైతులు యాసంగిలో ఒక్కపోస రకాన్ని సాగు చేశారు. చిట్యాల మండలంలో 13వేల ఎకరాల్లో వరి సాగు చేస్తే, అందులో 3500 ఎకరాల్లో రైతులు ఒక్కపోస రకం ధాన్యాన్ని సాగు చేశారు. ఈ రకం ధాన్యాన్ని రైతులు రెండుమూడేండ్లుగా సాగు చేస్తున్నప్పటికీ ఇప్పుడే ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి/నల్లగొండ సిటీ, ఏప్రిల్ 28 : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కనగల్ మండలంలోని శేరి లింగోటం, చెట్ల చెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముం దుగా శేరిలింగోటం ఐకేపీ కేంద్రా న్ని తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల లారీలు సరిగా రావడం లేదని తెలియడంతో అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.తక్షణమే కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వాహనాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ సరిగా ఉండాలని ఆదేశించారు. అనంతరం చెట్ల చెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను సరిగా నిర్వహించకపోవడా న్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, కేంద్రాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీసీఓ పత్యా నాయక్ ఉన్నారు.



నర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## నర్సమ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 28: మండలంలోని బడాయిగడ్డ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వల్యాయి అంజి మాతృమూర్తి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి సోమవారం గ్రామానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పిట్టల కృష్ణ, పాతనబోయిన సురేశ్, వలవాయి శివ, రాము, శంకర్, శ్రీను ఉన్నారు.

## శాలిగౌరారం ప్రాజెక్ట్ అభివృద్ధికి కృషి

● ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



శాలిగౌరారం ప్రాజెక్ట్ షట్టర్లను పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం

శాలిగౌరారం/రామన్నపేట, ఏప్రిల్ 28 : శాలిగౌరారం ప్రాజెక్టును ఆధునీకరించేందుకు కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంతో కలిసి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే రామన్నపేట మండలం పల్లివాడ వద్ద ఉన్న హెడ్‌వర్క్‌తో పాటు సూరారం, తుర్కపల్లి, శాలిగౌరారం ప్రాజెక్టు షట్టర్లను ఆయన పరిశీలించారు. రాచకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మనబోలు గ్రామ సమీపంలోని కొంత మంది రైతులు చేపల చెరువులు నిర్మించి మూసీ నీటిని అక్రమంగా వాడుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ జె. సత్యనారాయణ, డీఈ ఎం.సత్యనారాయణ, ఏఈలు అమర్‌కుమార్, విక్రమ్, కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, చింత దనుంజయ్య, నిమ్మల మధు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గంగుల రాజిరెడ్డి ఉన్నారు.

## ఎంఈడీ 3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

● సీఓఈ ఉపేందర్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 28 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ కళాశాల విద్యార్థులకు సంబంధించిన మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 28 : పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో 11 కేవీ లైన్ల షిఫ్టింగ్ కోసం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాలచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పట్టణంలోని గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియా, బస్టాండ్ ఏరియా, డాక్టర్స్ కాలనీ, అన్సారీ కాలనీ, దారుషఫా కాలనీ, సతీశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## మేడేను విజయవంతం చేయాలి : సీఐటీయూ

రామగిరి, ఏప్రిల్ 28: మేడే వేడుకల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కార్మికులు, హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హమాలీ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, వెల్ఫేర్ బోర్డు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మే 20న దేశంలోని 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు అవుట రవీందర్, రుద్రాక్షి శ్రీకాంత్, కొత్త రాజు, దొండ నగేశ్, మాధవ్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో బర్రె మృతి

త్రిపురారం, ఏప్రిల్ 28: మండలంలోని బెజ్జికల్ గ్రామ శివారులో సోమవారం విద్యుదాఘాతంతో బర్రె మృతి చెందింది. గ్రామానికి చెందిన అనుముల రఘుపతిరెడ్డికి చెందిన పాడి గేదె సోమవారం గ్రామ శివారులో మెరుగు వెంకటయ్య పొలం వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి నాగేంద్ర, బెజ్జికల్ విద్యుత్ లైన్‌మెన్ దీప్ల ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. మృతిచెందిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందని, తనకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

## నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు



మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో మిల్లులకు తరలించకుండా ఉన్న ధాన్యం బస్తాలు

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 28: మండలంలోని ఏడు ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలకు తీసుకు వచ్చి రోజులు గడుస్తున్నా తూకాలు వేయక పోవడంతో వారు ధాన్యం రాసుల వద్దే కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. లారీల కొరత, మిల్లులకు పంపించిన లారీల్లోని ధాన్యం దిగుమతిలో ఆలస్యం కారణంగానే కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐకేపీ కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నిర్వాహకులు ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి తమ ఇబ్బందులు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

## రజతోత్సవ సభకు తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు

● ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్

త్రిపురారం, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలకు ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మీద ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఈ సభతో నిరూపితమైందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని ఈ సభ ద్వారా ప్రజలంతా ముక్తకంఠంతో హెచ్చరించారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి సభకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని , వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని స్పష్టం చేశారు.

## అర్హులైన పేదలకు ఇండ్లు అందించాలని ధర్నా



తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చండూరు, ఏప్రిల్ 28: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. అర్హులైన పేదలను కాదని, అనర్హులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు సర్వేను పారదర్శకంగా నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయబ్ తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## గడ్డి వాము దగ్ధం

త్రిపురారం, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని బాబుసాయిపేట రోడ్డులో ఉన్న గోలి శ్రీనుకు చెందిన గడ్డివాము సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గడ్డివాముకు మంటలు అంటుకోగానే శ్రీను ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మిర్యాలగూడ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది. వేసవిలో పశుగ్రాసం కొరత రాకుండా ఉండేందుకు 300 కట్టల గడ్డిని వాముగా వేసుకుంటే కాలి బూడిదయ్యిందని శ్రీను తెలిపారు.



పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## పూలే, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నల్లగొండ సభలో ప్రొఫెసర్ కాసీం, జూలకంటి, సోమన్న, అంబటి పిలుపు

రామగిరి, ఏప్రిల్ 28 : సమాజ హితం కోసం కృషి చేసిన పూలే, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు మేధావులు పిలుపునిచ్చారు. నల్లగొండ గడియారం సెంటర్‌లో కులవివక్ష పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'పూలే, అంబేద్కర్ జన జాతర'సభలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసీం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, బహుజన యుద్ధ నౌక డాక్టర్ ఏపూరి సోమన్న, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య పాల్గొని పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో ప్రజలు ఉండాలంటే భారత రాజ్యాంగ ఫలాలు ప్రతి పేదవానికి చేరాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం కాకుండా మానవతత్వంతో మెలగాలన్నారు. దేశ ప్రజలందరూ పూలే, అంబేద్కర్ చూపిన బాటలో పయనించాలన్నారు. మహనీయుల జన జాతర కార్యక్రమాల ద్వారా సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంజీయూ తెలుగు విభాగం అధ్యాపకురాలు అనిత, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ నల్ల నర్సింహతోపాటు కళాకారులు ఆలపించిన పాటలు అలరించాయి. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, వివిధ సంఘాల నాయకులు పందుల సైదులు, దుడుకు లక్ష్మీనారాయణ, శ్రీను, పెరుమళ్ల బాలస్వామి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చందంపల్లి పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న హెచ్‌ఎం నవీన్‌రెడ్డి

నకిరేకల్, ఏప్రిల్ 28 : మండలంలోని చందంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనుకుంట్ల నవీన్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీశ్, చిత్రలేఖనం, పుస్తక పఠనం, చేతి రాత నైపుణ్యం, అభినయ గేయాలు, నాటక ప్రదర్శన, జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని బాలబాలికలు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ట్రస్మా రంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక



హిమాయత్ నగర్, ఏప్రిల్ 28: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం నూతన కమిటీ వివరాలను ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే అనిల్ కుమార్, కోశాధికారి కే శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గాయం భీష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పీ వెంకటరమణ, కోశాధికారి ఎండీ రఫీ, అసోసియేట్ అధ్యక్షుడు ఏ యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల అధ్యక్షుడు మారోజి ఆచార్య, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, శంకర్, కోశాధికారి రెహమాన్ పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంత



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి కాలనీలో రెయిన్‌బో పాఠశాలకు వెళ్లే సీసీ రోడ్డు మధ్యలో ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు వెంట రెండు ప్రైవేటు పాఠశాలు ఉండంతో నిత్యం వందల మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్తుంటారు. దాంతో పాటు పలు కాలనీలకు చెందిన ప్రజలు ప్రయాణిస్తుంటారు. రోడ్డు మధ్యలో ఉన్న మూల మలుపు వద్ద ఉన్న గుంత దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలకు గురువుతున్నారు. పాఠశాలకు వెళ్లే నడుచుకుంటూ, సైకిల్‌పై వెళ్లే విద్యార్థులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో మరీ ప్రమాదకరంగా ఉంది. గుంతను పూడ్చి రోడ్డును సరి చేయాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## కుక్కల బెడదను నివారించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 28: మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో కుక్కల బెడదను నివారించాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్‌కు వినతిపత్రం అందించారు. పట్టణంలోని 28, 43 వార్డుల పరిధిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వీధుల వెంట వెళ్లే ప్రజలపై దాడి చేసి కరుస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లలో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పిల్లలు కాలనీలో ఆడుకునే సమయంలో కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు మగ్దూపాషా, ఖాదర్, అయూబ్, కాలనీవాసులు మార్కస్‌పాషా, షకీల్, షఫి, యూనుస్, మొయిజ్, సాదిక్, నయీమ్, అలీ పాల్గొన్నారు.

## పహల్గావ్ ఉగ్రదాడి మృతులకు నివాళి



పహల్గావ్ మృతులకు నివాళులర్పిస్తున్న జనయేత్రి ఫౌండేషన్, పతంజలి యోగా సభ్యులు

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 28: కశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సోమవారం పట్టణంలోని చౌదరి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మునీర్ మాట్లాడుతూ టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండించారు. వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు అహ్మద్, జిల్లా కార్యదర్శి తాజ్‌బాబా, ఫౌండేషన్ సభ్యులు, పతంజలి యోగా సభ్యులు పాల్గొన్నారు.

**ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ**

కొండమల్లేపల్లి : జమ్ము కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అమానుషమని, ఇది పిరికి పందల చర్య అని ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పాషా అన్నారు. పహల్గావ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పిస్తూ జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భారతదేశంలో అన్ని మతాలు, కులాలు వారు ఐక్యమత్యంలో జీవిస్తున్నారు. ఇది ఓర్వలేని పాకిస్తాన్ ఉగ్రవాదులను ప్రేరేపించి దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుంభం శ్రీనివాస్‌గౌడ్, జున్నుద్దయ్య, బండి నరేశ్, పెద్దిశెట్టి సత్యం, సత్యనారాయణ, ఆరీఫ్, అల్తాఫ్, శ్రీను, యాదగిరి, రామకృష్ణ, జనార్ధన్, మైనొద్దీన్, బాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.



కొండమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు

## బస్సులోంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 28 : ఆర్టీసీ బస్సులోంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని బాజకుంట గ్రామానికి చెందిన ఎలుక మల్లేశ్ బొంబాయిలో కొంత కాలం ఉండి తిరిగి సొంతూరుకు వచ్చి కూలి పని చేసుకుంటున్నాడు. సోమవారం నార్కట్‌పల్లికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానిక బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ఫుడ్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తూ మార్గ మధ్యలో నల్లగొండ చౌరస్తా వద్ద కాలుజారి బస్సు నుంచి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక కామినేని దవాఖానాకు తరలించారు.

## ఐకేపీ కేంద్రాల్లో బిహార్ కూలీలు



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేసే పనిలో బిహార్ కూలీలు

శాలిగౌరారం, ఏప్రిల్ 28 : ప్రస్తుతం బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు జిల్లాలోని వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. ఉపాధి కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల వారు ఇప్పటి వరకు పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేవారు. ప్రస్తుతం పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా వారు పనులు చేసేందుకు వస్తున్నారు. శాలిగౌరారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బిహార్ కూలీలు హమాలీ పనులు చేస్తున్నారు. మండలంలో మొత్తం 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో అందరూ బిహార్ కార్మికులే హమాలీలుగా పని చేస్తున్నారు. చిత్తలూర్‌లో 16 మంది, బైరవునిబండలో 20, గురజాలలో 12, తుడిమిడి 12, రామాంజపురంలో 25, ఎన్జీకొత్తపెల్లిలో 14, తిరుమలరాయినిగూడెంలో 24మంది ఉన్నారు. తెలంగాణలో ఉపాధి దొరుకుతుందనే ఇక్కడికి వలస వచ్చినట్లు వారు చెబుతున్నారు.